స్వచ్ఛతలో నంబర్ వన్

- 52వ వార్డుకు పరిశుభ్రతలో మొదటి స్థానం
- ప్రత్యేక పురస్కారం కింద రూ.20 లక్షలు
- క్లీన్ అండ్ గ్రీన్‌లో విశాఖ నగరానికి ఆదర్శం
- పారిశుధ్య కార్మికుల సేవలకు గుర్తింపు
- ప్రజల భాగస్వామ్యంతో దక్కిన అరుదైన గౌరవం


ప్రధాన రహదారిలో శుభ్రం చేస్తున్న కార్మికులు


ఆహ్లాదకరంగా శాంతినగర్ పార్కు



అద్దంలా మెరుస్తున్న శాంతినగర్ ప్రధాన రహదారి

విశాఖ విద్య: స్వచ్ఛత– పరిశుభ్రత పాటించడంలో జీవీఎంసీ పరిధిలోని 52వ వార్డు విశాఖ నగరానికి రోల్ మోడల్‌గా నిలిచింది. మహా విశాఖ నగర పాలక సంస్థ పరిధిలో 8 జోన్లు.. వీటి పరిధిలో 98 వార్డులు ఉన్నాయి. పారిశుధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడంలో 52వ వార్డు మొదటి స్థానం దక్కించుకుంది. విశాఖ నగరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా 'ఎకో వైజాగ్' పేరిట క్లీన్ అండ్ గ్రీన్‌కు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ విషయంలో 52వ వార్డు అన్నింటా టాప్‌లో నిలిచింది.

వెల్లివిరిసిన చైతన్యం

వార్డును రోల్ మోల్‌గా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ తనదైన శైలిలో కృషి చేస్తున్నారు. అధిక మొత్తంలో నిధులు తీసుకొచ్చి ప్రజా అవసరాల మేరకు పనులు చేపడుతున్నారు. వార్డు పరిధిలోని అన్ని కాలనీల్లో అంతర్గత రహదారులు నిర్మించడంతో పాటు పార్కుల ఆధునీకరణకు ప్రాధాన్యం ఇచ్చారు. వార్డు ప్రజానీకం సైతం భాగస్వామ్యులవుతున్నారు. పారిశుధ్య కార్మికులు ఇటీవల సమ్మె చేయగా, కాలనీల ప్రజానీకం స్వచ్ఛందంగా తరలివచ్చి వీధుల్లో చెత్త తొలగించే కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

మూడంచెల పరిశీలనతో గుర్తింపు


ఎకో వైజాగ్‌లో భాగంగా జీవీఎంసీ పరిధిలోని 98 వార్డుల్లో క్లీన్ అండ్ గ్రీన్ కోసం పోటీ తత్వం పెంచాలా 'స్వచ్ఛత అవార్డు'లను ప్రకటించారు. పారిశుధ్య చర్యలతో పాటు, పచ్చదనం పెంపొందించడం.. వార్డుల్లో చేపడుతున్న కార్యక్రమాలపై మూడు దశల్లో పరిశీలన చేసిన బృందాలు 52వ వార్డుకు అత్యధికమార్కులు వేశారు. థర్డ్ పార్టీ పరిశీలనతో పాటు ఆంధ్ర యూనివర్సిటీ విద్యార్థులు కూడా వార్డులో పర్యటించారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సైతం ఎలాంటి సమాచారం లేకుండానే వార్డుల్లో ఆకస్మిక పర్యటన చేశారు. తనిఖీ బృందాల నివేదికల్లో వాస్తవికతను ధృవీకరించుకొని 52వ వార్డుకు మొదటి స్థానం ప్రకటించారు. రూ.20 లక్షలు ప్రత్యేక బహుమతిగా డిప్యూటీ మేయర్ అందుకున్నారు. వీటిని అభివృద్ధి, మౌలిక సౌకర్యాల కల్పనకు వినియోగించనున్నారు.


సుందరంగా కనిపిస్తున్న వుడా లే అవుట్ ప్రధాన రహదారి

52వ వార్డు పరిధిలో కాలనీలు :	10
సచివాలయాలు	4
గృహాలు	5,829
జనాభా	16,790
ప్రతీ రోజు సేకరించే చెత్త	8,743 కేజీలు
పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు	35 మంది
సూపర్ వైజర్లు	5
శానిటరీ సెక్రటరీ(సచివాలయం)లు	4
శానిటరీ ఇన్‌స్పెక్టర్లు	1
అందుబాటులో ఉన్న వాహనాలు	7


న్యూ కరాసలో డ్రైనేజీ శుభ్రం చేస్తున్న కార్మికులు

అందరి సహకారంతోనే..



జీవీఎంసీలో మా వార్డు మొదటి స్థానంలో నిలవడం ఎంతో సంతోషంగా ఉంది. వార్డు ప్రజల సహకారంతో ఈ గుర్తింపు లభించింది. పారిశుధ్య కార్మికులు అంకిత భావంతో పనిచేస్తున్నారు. మేము చేసే కార్యక్రమాల్లో కాలనీల అసోసియేషన్లు కూడా స్వచ్ఛందంగా భాగస్వామ్యమవుతున్నాయి.భవిష్యత్‌లోనూ దీన్ని నిలుబెట్టుకునేలా కృషి చేస్తాను.

– జియ్యాని శ్రీధర్, డిప్యూటీ మేయర్

మరింత బాధ్యత పెంచింది



మా వార్డుకు జీవీఎంసీలో మొదటి స్థానం రావడం ఎంతో సంతోషంగా ఉంది. స్వచ్ఛత అవార్డు రావడంతో మరింత బాధ్యత పెరిగింది. డిప్యూటీ మేయర్ శ్రీధర్, జీవీఎంసీ అధికారులు మాకు ఇచ్చిన గౌరవాన్ని భవిష్యత్‌లో నిలుపుకునేలా అంతా సమన్వయంతో పనిచేస్తాం.

– జీవీఎస్ మూర్తి, శానిటరీ ఇన్‌స్పెక్టర్

శ్రమకు తగిన ఫలితం దక్కింది



పదేళ్లుగా పనిచేస్తున్నాను. ఉదయం 5 గంటల నుంచి 11 గంటల వరకు అలాగే మధ్యాహ్నం 2 నుంచి 5గంటల వరకు విధుల్లో ఉంటాను. వీధులన్నీ శుభ్రం చేస్తుంటాం. మా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మమ్మల్ని ఎంతో బాగా చూసుకుంటారు. వార్డుకు పరిశుభ్రతలో అవార్డు వచ్చిందని చెప్పారు.మా శ్రమకు తగిన ఫలితం దక్కినందుకు సంతోషంగా ఉంది.

–గుడివాడ రమణమ్మ, పారిశుధ్య కార్మికురాలు, వుడా లే అవుట్

సంతోషంగా ఉంది



మా వార్డు శుభ్రంగా ఉందని అధికారులు మెచ్చుకోవడం చాలా సంతోషంగా ఉంది. వెయ్యి రూపాయల జీతంతో మొదలైన నేను పదిహేనేళ్లుగా ఇదే పనిలో ఉన్నాను. ముఖ్యమంత్రి జగన్ వచ్చిన తర్వాత మా జీతాలు కూడా పెరిగాయి. మా డిప్యూటీ మేయర్ శ్రీధర్ మాకు కావాల్సిన అవసరాలు కూడా తీరుస్తారు. అధికారులు కూడా బాగా సహకరిస్తున్నందునే రెట్టించిన ఉత్సాహంతో పనిచేస్తున్నాం.

– బి.రాము, పారిశుధ్య కార్మికుడు, మద్రిపాలెం

క్లుప్తంగా

అంజన్నకు ఆకు పూజ


పూజలు నిర్వహిస్తున్న అర్చకుడు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డు కరాసలోని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి కావడంతో తమలపాకులతో ప్రత్యేక అభిషేకం జరిపించారు. భక్తుల గోత్రనామాలతో అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు అప్పారావు భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించారు.

దుర్గాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెంలోని శ్రీ దుర్గాలమ్మ- బంగారమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినంతో పాటు అమ్మవారికి ప్రీతికరమైన రోజు కావడంతో విశేష పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి కీర్తలను ఆలపించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

మర్యాదపూర్వక కలయిక


ఆనంద్‌కుమార్‌ను సత్కరిస్తున్న శ్యామ్

సింథియా: జీవీఎంసీ 40వ వార్డు వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ దండి శ్యామ్ మండల కమిటీ క్లస్టర్–1 కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా మంగళవారం పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేస్తానని దండి శ్యామ్ తెలిపారు.

సమస్యల పరిష్కారం కోరుతూ వినతి


డాక్టర్ రేవతికి వినతి పత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

విశాఖ విద్య: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ కార్యకర్తలు బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు రొంగలి రేవతికి వినతి పత్రం అందజేశారు. అసోసియేషన్ నాయకురాలు మేరీ మాట్లాడుతూ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు విజయవాడ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఆశలకు వేతనాల పెంపుతో పాటు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు తోటమ్మ, కనకదుర్గ, సంతోషి, ఆశ, శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు భోజనం


భోజనం వడ్డిస్తున్న నవ్య

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ షెల్టర్‌లోని నిరాశ్రయులకు మంగళవారం మధ్యాహ్న భోజనం అందించారు. నగరంలోని దొండపర్తికి చెందిన నవ్య తన భర్త సురేంద్ర జ్ఞాపకార్థం జీవీఎంసీ షెల్టర్‌లో పుట్టిన రోజు వేడుక నిర్వహించారు. నిరాశ్రయుల మధ్య కేట్ కట్ చేసి అనంతరం భోజనం అందించారు. మేనేజర్ ఎల్లేటి మమత తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటరు జాబితా

- తొలగింపులపై సమగ్ర పరిశీలన చేయాలి
- ఏఈఆర్‌వోలు క్షేత్రస్థాయిలో పర్యటించాలి
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్


మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

విశాఖ విద్య: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ప్రకటించిన ఓటరు జాబితాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని విశాఖ ఆర్డీవో, పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ సూచించారు. గోపాలపట్నం తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులు, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఓటు నమోదుతో పాటు ఇతర అభ్యంతరాలపై వచ్చిన దరఖాస్తులపై రాజకీయ పార్టీల వారితో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అర్హులైన ఓటర్లతో ఫైనల్ జాబితా ప్రకటించటం జరిగిందన్నారు. కొత్తగా ఓటు నమోదులో 18, 19 ఏళ్ల గల వారినే పరిగణలోకి తీసుకొని సత్వరమే విచారణ పూర్తి చేయాలన్నారు. మిగతా వారికి ఓటు హక్కు కల్పించే విషయమైన జిల్లా కలెక్టర్ అనుమతితో ఎన్నికల కమిషన్‌కు నివేదించడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తామని ఎవరైనా ముందుకొచ్చి ఓటు హక్కు కల్పించాలని కోరితే వాటిని ప్రత్యేకంగా పరిగణించి పరిశీలించాలన్నారు. తొలగింపుల విషయంలో ఏఈఆర్‌వోలదే బాధ్యత అన్నారు. ఓటరు జాబితాలో ఒకే వ్యక్తి పేరు రెండు చోట్ల ఉండటానికి వీల్లేదన్నారు. సమావేశంలో గోపాలపట్నం తహసీల్దార్ పి. విజయభాస్కర్, జోనల్ కమిషనర్లు, ఆర్జీవీ. కృష్ణ, హేమవతి, ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని అన్ని మండలాల ఏఈఆర్‌వోలు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీని సందర్శించిన జోనల్ కమిషనర్


వివరాలు తెలుసుకుంటున్న జెడ్సీ హేమలత

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జోనల్ కమిషనర్ హేమవతి సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న సేవలపై డాక్టర్ రేవతి, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇటీవల నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాల్లో సేవలు పొందిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ నమోదులో తలెత్తుతున్న ఇబ్బందులను ఆరోగ్య కార్యకర్తలు జెడ్సీ దృష్టికి తీసుకొచ్చారు. ప్రజలకు సకాలంలో సత్వర వైద్య సేవలు అందించేలా అంతా సమన్వయంతో పని చేయాలని ఆమె సూచించారు.

పలు వార్డుల్లో పర్యటించిన ఆర్డీవో


పాతగోపాలపట్నం జువ్వాలమ్మ కాలనీ వాసులతో సమస్య గురించి ఆరా తీస్తున్న ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్, బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: జీవీఎంసీ 89,91,92 వార్డుల్లో మంగళవారం ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో సమస్యలను జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, 89వ వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి గోపాలకృష్ణ వివరించారు.91వ వార్డులో రైల్వేకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలతో పాటు బాజీ జంక్షన్ ఎస్సీ కాలనీ వద్ద అంబేడ్కర్ విగ్రహం నుంచి శ్మశాన వాటిక వైపు వెళ్లే రహదారి సమస్య, పాత గోపాలపట్నం జువ్వాలమ్మ కాలనీలో ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆర్డీవోను కోరారు. 92వ వార్డు పరిధిలో రైల్వే 5 మదాల వద్ద రోడ్డు, శ్రీరామ్‌నగర్ వద్ద కొత్తపాలెం వేళ్లే మదాల వద్ద డ్రైనేజీ నిర్మాణం వంటి సమస్యలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బెహరా భాస్కరరావు మాట్లాడుతూ రైల్వేతో ముడిపడి ఉన్న సమస్యలను వైఎస్సార్ సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఆయన ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి సమస్య వెళ్లడంతో పరిష్కారం దిశగా ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పర్యటించారని తెలిపారు. 89వ వార్డులో అండర్ పాత్‌వే నిర్మాణం వల్ల ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం కల్పించాలని కోరామన్నారు. పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, 91, 92వ వార్డుల అధ్యక్షుడు గుణిశెట్టి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, జేసీఎస్ క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, స్థానికులు కంపర కోటేశ్వరరావు, పీఎస్ రాజు, దవళ మోహన్, గొంతిన నాగరాజు, డానియల్, లోకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డిపో మేనేజర్ రాజశేఖర్ తదితరులు

సింహాచలం: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సింహాచలం ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రాజశేఖర్ కోరారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మంగళవారం సింహాచలం దేవస్థానం సంస్కృతోన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రత నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డిపోమేనేజర్ రాజశేఖర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల కారణంగా ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. రోడ్లపై ప్రయాణించే వారు విధంగా నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్ వినియోగం, సిగ్నల్ క్రాసింగ్, రోడ్డు దాటుతున్నప్పుడు నిర్లక్ష్యంగా ఉండటం, అతివేగం రోడ్డు ప్రమాదాలకు కారణమని తెలియజేశారు. గణాంకాలను బట్టి గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువగా పాదచారులు, ద్విచక్రవాహనదారుల ప్రమాదాలకు గురయ్యారని వెల్లడించారు. పిల్లలు రోడ్లపై నడుస్తున్నప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ సాయితులసి, మెకానికల్ ఇన్‌చార్జి కె.కొండలరావు, ట్రాఫిక్ సూపరింటెండెంట్ కె.కుమారి, హెచ్‌ఎం భాను తదితరులు పాల్గొన్నారు.

ఆయా పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

పెందుర్తి: పెందుర్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో డి.నీలవేణి ఓ ప్రకటనలో తెలిపారు. పెందుర్తి మండలం గొరపల్లి, చింతలగ్రహారం–1, సరిపల్లి–2, జీవీఎంసీ 69వ వార్డు నాతయ్యపాలెం–1, 64వ వార్డు గొడ్డువానిపాలెం, 77వ వార్డు చిన్నపాలెం, 97వ వార్డు నారవానిపాలెం, 76వ వార్డు కర్ణవానిపాలెం, 75వ వార్డు నెల్లిముక్కు, 85వ వార్డు పెద మడక, 74వ వార్డు దల్లివానిపాలెం కేంద్రాల్లో అంగన్‌వాడీ ఆయా పోస్టుల కోసం ఈ నెల 15 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ఆమె సూచించారు.

డీ వార్మింగ్ డే కు సిద్ధం కావాలి


మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి

విశాఖ విద్య: పిల్లల్లో నులిపురుగుల నివారణకు ఈ నెల 9న నిర్వహించే డీ వార్మింగ్ డే విజయవంతం చేసేందుకు అంతా సిద్ధం కావాలని బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి సూచించారు. సచివాలయ ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో మంగళవారం యూపీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యూపీహెచ్‌సీ పరిధిలోని 8 సచివాలయాల్లో ఏడాది నుంచి 19 ఏళ్ల లోపు గల 15,516 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయాలన్నారు. నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. అవసరమైన స్టాక్‌ను ముందుగానే తీసుకొని భద్రపర్చుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాల్లో కూడా కార్యక్రమం చేపట్టాలన్నారు.

'పెన్షనర్ల గోడు కేంద్రానికి పట్టదా..'


మాట్లాడుతున్న నాయకులు

విశాఖ విద్య: పింఛను దారుల సమస్యలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు కనకేశ్వరరావు, దీనుబంధు, హుస్సేన్ అన్నారు. సమస్యల పరిష్కారం కోరుతూ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్రిపాలెంలోని పీఎఫ్ కార్యాలయం ముందు మంగళవారం నిరసన దీక్షలు చేపట్టారు. స్టీల్ ప్లాంట్ రిటైర్డ్ కార్మికులు ధర్నాలో కూర్చొన్నారు. అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలపై పోరాటాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వ పెద్దలు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. అనేక మందికి రూ.వెయ్యి లోపు పింఛను వస్తుందని, అధికారంలోకి వస్తే రూ.3 వేలు మినిమం పింఛను చేస్తామని ప్రకటించినా ఆచరణలో విఫలమైందన్నారు.

బీజేపీ విధానాలతో ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం

మల్కాపురం: దేశంలో ప్రభుత్వ రంగ పరిశ్రమల మనుగడ దెబ్బతినే విధంగా కేంద్రంలోని బీజేపీ సర్కారు నిర్ణయాలు తీసుకుంటుందని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అంగ భానూజ్‌వర్మ అన్నారు.59వ వార్డు నక్కవానిపాలెంలోని తన నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. త్యాగాల ఫలితంగా ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరించాలని యోచించడం దారుణమన్నారు.తక్షణమే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అంగ అప్పలరాజు, నాయకులు సురుపల్లి మరియదాస్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్సీ దృష్టికి ఎన్టీఆర్ కాలనీ సమస్యలు


జెడ్సీ కృష్ణకు వినతి పత్రం అందిస్తున్న కార్పొరేటర్ లక్ష్మణరావు

సింథియా: జీవీఎంసీ 62వ వార్డు ఎన్టీఆర్‌కాలనీ (హుద్‌హుద్‌కాలనీ)లో సమస్యలపై జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 62వ వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు మంగళవారం జీవీఎంసీ జోన్–5 జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూకాలనీలో మంచినీటి సమస్య, యూజీడీ సమస్య, హౌస్‌ట్యాక్స్ తదితర ప్రధాన సమస్యలు ఉన్నాయని ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆయా సమస్యలను పరిష్కారిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఆ హామీ అమల్లో భాగంగా జెడ్సీని కలిసి కాలనీ సమస్యలపై వినతి ప్రతం అందించామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జెడ్సీ బుధవారం సంబంధిత అధికారులను కాలనీకి పంపించి ముందుగా ఇంటిపన్నులు వేయిస్తామని, దానితో పాటు మిగిలిన సమస్యలపై త్వరితగతిన నివేదిక తీసుకుని వెంటనే వాటిని పరిష్కారించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చినట్టు చెప్పారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భీశెట్టి గణేష్, నాయకులు రామకృష్ణ, గ్రామకమిటీ సభ్యులు అప్పలరాజు, పాస్టర్ ఇస్రాయెల్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉపాధి కల్పించాలని నిరసన

మల్కాపురం: హెచ్‌పీసీఎల్ విస్తరణ పనుల్లో స్థానిక నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ టీఎన్‌టీయూసీ నాయకులు హెచ్‌పీసీఎల్ సీ గేటు వద్ద మంగళవారం ఆందోళన చేపట్టారు. నాయకులు పాండ్రంగి జయరాజ్,దేవర అప్పలరాజు మాట్లాడుతూ యాజమాన్యానికి పలు మార్లు వినతులు ఇచ్చినా తగిన రీతిలో స్పందించలేదని ఆరోపించారు. ఇప్పటికైనా స్పందించి ఉపాధి కల్పించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

జగన్ మళ్లీ సీఎం కావాలని పూజలు

మల్కాపురం: రాష్ట్రానికి మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని.. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఆడారి ఆనంద్‌కుమార్ అధిక మెజార్టీతో గెలవాలని కోరుతూ పారిశ్రామిక ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మంగళవారం తలుపులమ్మతల్లి ఆలయంలో పూజలు చేశారు. 60వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చింతలపాటి సన్యాసిరాజు (మారుతి శ్రీను)ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, పార్టీ నాయకులు సంతోష్,నర్సింగ్,రెడ్డి,అశోక్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో ముగిసిన జాతీయ సదస్సు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో భారతీయ భాషల్లో విద్య–సాంకేతిక పదజాలం ప్రాధాన్యతపై జరిగిన రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేత్యత్వంలో జరిగిన సదస్సులో పలువురు వక్తలు ప్రసంగించారు. అంతర్జాలం ద్వారా సాంకేతిక పదజాల నిర్మాణంలో నూతన పోకడలను వివరించారు.

అందరి సహకారంతో పర్యావరణ పరిరక్షణ


కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు

మల్కాపురం: మొక్కలు నాటడం,ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు దోహదపడాలని జాతీయ సేవా ప్రోగ్రాం అధికారి ఇ.పి.ఎస్.భాగ్యలక్ష్మి అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో మంగళవారం పర్యావరణంపై నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటి వద్ద ఒక్క మొక్క అయినా నాటాలని, రాష్ట్రం నలుమూలల మొక్కలు అధికంగా నాటే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమం అనంతరం విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో పలు ఔషధ మొక్కలు నాటారు.